## క్లుప్తంగా

### గ్యాస్ సిలిండర్ లీకై మంటలు

ఏలూరు టౌన్ : ఏలూరు అశోక్ నగర్ ప్రాంతంలో ఒక అపార్టుమెంట్‌లో గ్యాస్ సిలిండర్ పైపు ఊడిపోయి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఆస్తి నష్టం సంభవించగా మహిళకు ప్రాణాపాయం తప్పింది. అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక అశోక్ నగర్లోని ఒక అపార్టుమెంటు మొదటి అంతస్తు ఫ్లాట్‌లో గురువారం రాత్రి మహిళ వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ నుంచి పొయ్యికి వెళ్లే ట్యూబు ఓ వైపు ఊడిపోయి మంటలు వ్యాపించాయి. మహిళ అక్కడ నుంచి తప్పుకోవటంతో ప్రమాదం తప్పింది. వంట గది అంతా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపుచేశారు. వంట గదిలో కప్‌బోర్డులు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.2 లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక శనివారపు పేట సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారపు పేట, శ్రీరామ్ నగర్, విద్యా నగర్, శాతవాహన నగర్, దొండపాడు, న్యూ అశోక్ నగర్, దుగ్గిరాల ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

### ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోండి

దెందులూరు: త్వరలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం వచ్చే నెల 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లు, లెక్చరర్లు, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే టీచర్లు ఫారం -19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. నియోజకవర్గంలో మూడు సంవత్సరాలు నిర్వాసితులై ఉండాలని, ఏ సంస్థలో పనిచేస్తున్నారో ధ్రువీకరణ పత్రం దరఖాస్తుకు జత చేయాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 15వ తేదీలోపు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తహసీల్దార్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. 15వ తరువాత స్క్రూటినీ, నవంబర్ 6న ఫైనల్ పబ్లికేషన్ ఉంటుందని తహశీల్దార్ వివరించారు.

### కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు. మండలంలోని తోటగూడెం గ్రామం వైపు నుంచి పెదపాడుకు కోళ్ల వ్యర్థాలను వాహనంలో తరలిస్తుండగా సీజ్ చేసినట్టు ఎస్సై శుభశేఖర్ తెలిపారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు.

# అక్రమాలకు అడ్డాగా 'అంజుమన్'

- బై లాకు వ్యతిరేకంగా కార్యకలాపాలు
- సంస్థ ఆస్తుల దోపిడీ
- కోర్టు ఆదేశాలను ధిక్కరించి కమిటీ ఎన్నిక, కార్యక్రమాల నిర్వహణ


నగరంలోని అంజుమన్ ఫంక్షన్ హాల్


ఫోర్జరీ సంతకంతో విత్‌డ్రా చేసిన చెక్కు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు నగరంలో ముస్లింకు సంబంధించిన అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ అక్రమాలకు అడ్డాగా మారింది. గతంలో ఈ సంస్థ పాలకులు ముస్లింల సేవే పరమావధిగా కార్యకలాపాలు సాగిస్తూవచ్చారు. ఐతే, కొన్నేళ్లుగా అధికారంలో ఉన్న కార్యవర్గం అక్రమాలకు తెరతీసి సంస్థ ఆస్తులు, ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తోందని ముస్లిం వర్గాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. ఐనా, కమిటీ ఎన్నిక నుంచి నిధుల ఖర్చు, బైలాకు వ్యతిరేక కార్యకలాపాల నిర్వహణ, సంస్థ ఆస్తుల దోపిడీ వంటి చర్యలు కొనసాగిస్తున్నారని వాపోతున్నాయి. అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థకు నగరంలోని ఒన్‌టౌన్‌లో 63 దుకాణాల సముదాయాలు, ఒక ఫంక్షన్ హాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.3.50 లక్షల ఆదాయం వస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థకు బ్యాంకులో సుమారు రూ.50 లక్షల వరకు నిధులు ఉన్నట్టు చెబుతున్నారు.

**కోర్టు ధిక్కరణతో కమిటీ ఎన్నిక**

సంస్థ బై లా ప్రకారం ఈ సంస్థకు ప్రతి మూడేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాలి. అయితే కొన్ని పాలక వర్గాలు కొన్నేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా కాలం గడిపాయి. ఇటీవల సంస్థ సభ్యుల తీవ్రంగా ఒత్తిడితో పాత పాలకవర్గం ఎట్టకేలకు ఐదేళ్ల తరువాత ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. సంస్థ బై లాకు విరుద్ధంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేశారని సంస్థ సభ్యుడు ఎస్కే మస్తాన్ బాషా గతంలో కోర్టులో కేసు దాఖలు చేశారు. సంస్థ ఎన్నికలు నిర్వహించుకోవచ్చని, కార్యవర్గ ఎన్నిక, కార్యవర్గాన్ని ప్రకటించకూడదని కోర్టు పేర్కొంది. అయినప్పటికీ గత మార్చి నెల 9వ తేదీన సంస్థ ఎన్నికలు నిర్వహించడం, కోర్టు ఆదేశాలను ధిక్కరించి అదే రోజు కౌంటింగ్ నిర్వహించి గత కార్యవర్గమే తిరిగి అధికారంలోకి వచ్చిందని ప్రకటించారు. ఆ కార్యవర్గమే అనధికారికంగా కార్యకలాపాలు సాగిస్తూ వస్తోంది. సంస్థ ఏటా ఉచితంగా నిర్వహించే ఖత్నా (సున్తీ) కార్యక్రమాన్ని గత మే నెలలో నిర్వహించింది. ఈ కార్యక్రమ నిర్వహణలో కొన్ని నిధులు దారి మళ్లాయని అప్పట్లో పెద్ద రాద్ధాంతమే జరిగింది.

**నాలుగు చెక్కుల తిరస్కరణ**

గత రెండు వారాల్లో ఈ సంస్థ నగదు విత్‌డ్రా చేసుకోవడానికి బ్యాంకులో సమర్పించిన నాలుగు చెక్కులు సంతకం సరిపోలకపోవడంతో బ్యాంకు అధికారులు తిరస్కరించారు. ఈ చెక్కులను ఆమోదిస్తే మరిన్ని రూ.లక్షలు దుర్వినియోగమయ్యేవని చెబుతున్నారు. మార్చి నెలలో ఎన్నికలకు ముందే ఒక అడ్‌హాక్ కమిటీని వేసి, దాని ద్వారా కొత్తగా 1,345 మందికి సభ్యత్వాలు ఇచ్చారు. ఆ సభ్యత్వాల రుసుము సుమారు రూ.10.50 లక్షలను సంస్థ బై లాకు విరుద్ధంగా కోఆప్షన్ సభ్యుడి వ్యక్తిగత అక్కౌంట్‌లో జమ చేశారని ఆరోపిస్తున్నారు.

**పదవుల పందేరం**

ఈ సంస్థ అధ్యక్షుడు, కొందరు సభ్యులు చేసే అక్రమాలను ప్రశ్నించే సభ్యులను మచ్చిక చేసుకోవడానికి వారికి పదవులను కట్టబెట్టారు. బై లా ప్రకారం సంస్థ కార్యవర్గంలో ఇద్దరు ఉపాధ్యక్షులు, ఇద్దరు సంయుక్త కార్యదర్శులు మాత్రమే ఉండాలి. ప్రస్తుత కార్యవర్గంలో ఆరుగురు ఉపాధ్యక్షులు, ఆరుగురు సంయుక్త కార్యదర్శులను తీసుకున్నారు. మరో 12 మందికి కో ఆప్షన్ పదవులు కట్టబెట్టారు. సొసైటీల చట్టం ప్రకారం సంస్థను ఏటా రిజిస్ట్రార్ కార్యాలయంలో రెన్యువల్ చేయించాలి. గత ఆరేళ్లుగా ఎటువంటి రెన్యువల్ చేయించలేదని చెబుతున్నారు.

### న్యాయ పోరాటం చేస్తాం



సంస్థలో అక్రమాలకు అడ్డకట్ట వేయాలి. అధ్యక్షుడు సులేమాన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సంస్థ ఆదాయాన్ని పక్కదారి పట్టిస్తున్న అంశంపై న్యాయ విచారణ చేయాలి. కోర్టు ఉత్తర్వులను దిక్కరించి ఎన్నికైన కమిటీని రద్దు చేసి ముస్లిం పెద్దల సమక్షంలో పారదర్శకంగా కమిటీని ఎన్నుకోవాలి. అక్రమంగా, అనధికారికంగా వినియోగించిన మొత్తాన్ని తిరిగి సంస్థ ఖాతాకు జమచేయాలి. సంస్థలో జరుగుతున్న అక్రమాలపై న్యాయపోరాటం కొనసాగిస్తాం.

– ఎస్కే మస్తాన్ బాషా, అంజుమన్ సంస్థ సభ్యుడు

### సంతకం ఫోర్జరీతో రూ.1.50 లక్షల విత్‌డ్రా

ఈ సంస్థ బ్యాంకు లావాదేవీలను అధ్యక్షుడు, కోశాధికారి సంతకాలతో నిర్వహించాలని నిబంధన ఉంది. తాజాగా ఈ నెల 27వ తేదీన పవర్‌పేటలోని సెంట్రల్ బ్యాంక్ శాఖలోని ఈ సంస్థ అక్కౌంట్ నుంచి రూ.1.50 లక్షలు విత్‌డ్రా చేశారు. దీనికి అధ్యక్షుడు, కోశాధికారి సంతకం చేసిన చెక్కును బ్యాంకులో అందజేశారు. అయితే అనారోగ్యంతో ఈ నెల 27న ఉదయం సంస్థ కోశాధికారి మదార్ ఖాన్ మృతి చెందారు. అదే రోజు మధ్యాహ్నం ఆయన పేరుతో చెక్కు ఎలా వచ్చిందని ఆ సంస్థ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఈ చెక్కుపై మదార్‌ఖాన్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని, ఆయన గతంలో చేసిన సంతకాన్ని పోల్చి చూస్తే విషయం బయటపడుతుందని సభ్యులు చెబుతున్నారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


వైఎంహెచ్‌ఏ హాలులో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రతినిధులు


వెంకటాపురం పాఠశాలలో ఉపాధ్యాయురాలికి సన్మానం


తెలుగు అక్షర మాలికతో ఒదిగిన విద్యార్థులు


తెలుగు కవులు, తెలుగుతల్లి వేషధారణల్లో విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా గురువారం నగరంలోని వివిధ విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో తెలుగు భాషా దినత్సోవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు తెలుగు భాషా ప్రముఖుల వేషధారణలతో అలరించారు. హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఏ హాలులో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. రామమూర్తి పంతులు చిత్రపటానికి సంఘం మేనేజ్ మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు అంబికా రాజా కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, ఉపాధ్యక్షుడు కేకే గుప్తాలు పూలమాలలు వేసి స్మరించారు. కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ గుత్తా గిరి బాబు గిడుగు వెంకట రామమూర్తి సేవలను కొనియాడారు. తెలుగు అధ్యాపకులు ఎస్ పరమేశ, వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు, కళాశాల సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు టీవీ దుర్గాప్రసాద్ రచయిత బి. నాగాస్త్ర విశ్రాంత అధ్యాపకులు శ్రీహరి కోటి మాట్లాడారు. అధ్యాపకులు వి.వెంకట్ రావు, ఎం విజయ్ కుమార్, ఎం కృష్ణ చైతన్య, పి.కావ్య శ్రీ తదితరులు పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు.

- వెంకటాపురం ఇందిరా కాలనీ ఎంపీయూపీ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు టి. శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు జి.కృష్ణ మాట్లాడుతూ తెలుగు భాషా విలువలను ముందు తరాలకు అందజేసినప్పుడే మన నిజమైన వారసత్వం నిలబడి ఉంటుందన్నారు. తెలుగు ఉపాధ్యాయిని డి.మెర్సీని దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.
- సీఆర్ఆర్ కళాశాల తెలుగు శాఖ, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో తెలుగు భాషా బోధన – ఆధునిక పద్ధతులు అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ సుబ్బారావు విశిష్ట అతిథిగా పాల్గొని తెలుగు భాష వైభవాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, ప్రధాన వక్త శతావధాని బులుసు అపర్ణ మాట్లాడుతూ తెలుగు భాషను అభివృద్ధి చేసే పద్ధతులు, అవధాన ప్రక్రియ విశేషాలను వివరించారు.
- శ్రీశ్రీ విద్యా సంస్థల్లో విద్యార్థులు తెలుగు కవుల వేషధారణలతో అలరించారు. తెలుగు అక్షరాల ఆకృతిలో విద్యార్థులు చేసిన విన్యాసం అబ్బురపరిచింది. ద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, శతకపద్యాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యా సంస్థల అధినేత ఎంబీఎస్ శర్మ, ఇన్‌చార్జీలు సీహెచ్ దివ్య, కె.విజయలక్ష్మి, తెలుగు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఆర్ఆర్‌పేట శ్రీ శర్వాణి పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ సత్యశారద రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తెలుగు కవులు, తెలుగుతల్లి వేషధారణలతో అలరించారు. పాఠశాల డైరెక్టర్ మదన్ మోహన్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఫ్యాషన్ డిజైనింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వివిధ వృత్తి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ (ఆంధ్రా బ్యాంక్) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులో 30 రోజుల ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 3 నుంచి ప్రారంభమయ్యే ఈ కోర్సులో చేరడానికి 5వ తరగతి, ఆ పై విద్యార్హత ఉండి, 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉన్న మహిళలు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత, భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామని, ఆసక్తి గల మహిళలు సెల్ నెంబర్లు 99485 65256, 95330 79471, 90140 40780లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశాల సమయంలో ఆధార్, రేషన్ కార్డు జిరాక్సులు, మూడు పాస్‌పోర్టు ఫొటోలు అందజేయాలని పేర్కొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురైన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి.. దెందులూరు మండలం కొవ్వలికి చెందిన మేరుగ జాన్ (42) ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో అటెండర్‌గా పని చేస్తుంటాడు. అతను ఈనెల 24న దెందులూరులో బంధువుల శుభకార్యానికి హాజరై మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా జాతీయ రహదారి నుంచి ఆశ్రం ఆసుపత్రి వైపు వెళ్లే సర్వీసు రోడ్డులోకి వాహనం మళ్లిస్తుండగా ఒక్కసారిగా అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో జాన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి స్థానికులు అతన్ని సమీపంలోని ఆశ్రం ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నేరం

ఏలూరు టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని ఏలూరు 2 టౌన్ సీఐ రమణ అన్నారు. గురువారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 10 మందిని అదుపులోకి తీసుకుని టూటౌన్ స్టేషన్‌కు తరలించారు. వారికి కౌన్సెలింగ్ ఇస్తూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, దానివల్ల శరీరం అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. మద్యపానం వల్ల మానసిక స్థితి మన అదుపులో ఉండదని, ఇతరులకు ఇబ్బందికరంగా మారుతుందని వివరించారు. ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### పూడిక తీత పనుల పరిశీలన

ఏలూరు (టూటౌన్): నగరంలో రోడ్డు మరమ్మతు, మేజర్ డ్రెయిన్‌లో షిల్ట్ తొలగింపు పనులను నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు గురువారం పరిశీలించారు. రూ.80 లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి ప్రధాన రోడ్లు మరమ్మతులు, డ్రెయిన్‌లో షిల్ట్ తొలగింపు పనులు చేస్తున్నట్టు చెప్పారు. వన్ టౌన్, టూటౌన్ ప్రాంతాల్లో సుమారు 13 మేజర్ డ్రెయిన్లలో షిల్ట్ తొలగిస్తున్నట్టు తెలిపారు. ట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ తాతబ్బాయి, ఏఈ రఫీ, కార్పొరేటర్లు బత్తిన విజయ్ కుమార్, దేవరకొండ శ్రీనివాసరావు, నున్న కిషోర్, దారపు తేజ, ఆరేపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 28 | అరటి కాయ (1) | 07-10 |
| వంకాయలు (గులాబీ) | 28 | చిక్కుడు కాయలు | 48 |
| వంకాయలు (కాంతులు) | 36 | చామదుంపలు | 46 |
| వంకాయలు (తెలుపు) | 40 | ములక్కాడలు | 7,10 |
| బెండకాయలు | 30 | కంద | 60 |
| పచ్చిమిర్చి | 24 | బీట్‌రూట్ | 36 |
| కాకర కాయలు | 30-34 | కీరా దోస | 50 |
| బీరకాయలు | 32 | ఫ్రెంచ్‌బీన్స్ | 80 |
| బీరకాయలు (పందిరి) | 44 | అల్లం | 80-160 |
| క్యాబేజీ | 28 | కొత్తిమీర (కట్ట) | 40 |
| క్యారెట్ | 36-48 | పాలకూర | 10 |
| దొండకాయలు | 26 | చుక్కకూర | 10 |
| బంగాళదుంపలు | 40 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 50 | గోంగూర | 07 |
| గోరుచిక్కుడు | 40 | పుదీనా | 05 |
| దోసకాయలు | 24 | బఠాణీ | -- |
| అనబకాయ (1) | 25-30 | క్యాప్సికమ్ | 70 |
| పొట్లకాయ(1) | 20 | చిలకదదుంప | 48 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 34 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 38 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్) | 22.30 | 16 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 35 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 30 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 33 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 30 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 28 |
| ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 27 |
| ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 20.30 | 4800 | 29 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 30 |
| ఏలూరు - ఈసీఐఎల్ | 22.30 | 4814 | 20 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 32 |

## క్రీడా పోటీల్లో విజేతలకు పతకాలు


బాస్కెట్‌బాల్ బాలికల విభాగంలో విజయం సాధించిన కస్తూరిబా స్కూల్ జట్టు


బాస్కెట్‌బాల్ బాలుర విభాగంలో విజేత జట్టు



అథ్లెటిక్స్ అంశంలో పతకాలు సాధించిన సచివాలయ ఉద్యోగులు, బ్యాడ్మింటన్, లెమెన్ స్పూన్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన ఏపీఎం ప్రభావతి

ఏలూరు రూరల్ : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఏలూరులో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆటల పోటీలు ముగిశాయి. గురువారం ఉదయం జిల్లా కలెక్టరేట్ గోదావరి హాల్లో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. విజేతలకు కలెక్టర్ కె వెట్రిసెల్వి మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. బాస్కెట్‌బాల్ విభాగంలో ఏలూరు కస్తూరిబా బాలికల జట్టు, బాలుర విభాగంలో అల్లూరి సీతారామరాజు స్టేడియం జట్టు విజయం సాధించాయి. డ్వాక్రా సంఘాల పర్యవేక్షకురాలు ఏపీఎం ప్రభావతి బ్యాడ్మింటన్, లెమన్‌స్పూన్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచారు. ఏలూరులో పలు సచివాలయాల ఉద్యోగులు అథ్లెటిక్స్ అంశాల్లో విజయం సాధించారు.

# పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రమాదాలను అరికట్టాలి



ధర్నా చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): పారిశ్రామిక ప్రాంతాల్లో జరిగే ప్రమాదాలను అరికట్టాలని ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇఫ్టూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం సాయంత్రం ఏలూరు వన్‌టౌన్ ఏరియా ఇఫ్టూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కల్పన థియేటర్ వద్ద నుంచి చందన మెయిన్ రోడ్డు పాత బస్టాండ్ వరకు ప్రదర్శనగా వచ్చి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక విధానాలకు వ్యతిరేకంగా నినదించారు. ధర్నా చేశారు. వెంకట్రావు, శ్రీనివాసరావులు మాట్లాడుతూ పారిశ్రామిక వాడల్లో ప్రమాదాలకు సెజ్ చట్టాన్ని ప్రవేశ పెట్టడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవటం, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ప్రభావమే కారణమని ఆరోపించారు. అచ్చుతాపురం బేస్ సెజ్ ప్రాంతంలో 250 పరిశ్రమలు ఉన్నాయని, అందులో 220 పరిశ్రమలు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నట్లు ఎంక్వైరీ రిపోర్టులో తేలిందని స్వయంగా హోంమంత్రి అనిత విలేకరుల వద్ద వెల్లడించారని గుర్తు చేశారు. బీఎన్ఎస్ సెక్షన్ 105 ప్రకారం కేసులు నమోదు చేసి యజమానులను శిక్షించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ బ్లాస్టింగ్‌లో మరణించిన కుటుంబాలకు యజమానిచే రూ.కోటి పరిహారంతో పాటు, ప్రభుత్వం కూడా రూ.కోటి చెల్లించాలని కోరారు. పరిశ్రమల్లో తప్పనిసరిగా ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈఎస్ఐ ఆసుపత్రులు, స్పెషల్ బర్న్ వార్డులు ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పల్లి గంగరాజు, ఘంటసాల రాంబాబు, జగ్గారపు రమణ, రంగాల నూకరాజు, బి.వీరభద్రం, గుంజ వెంకటేశ్వరరావు, నవుడు నీరు బాబు, కె.త్రినాథ్, మీసాల రమణ, కె.నాని తదితరులు పాల్గొన్నారు.